కథ

# అక్రోధేన జయేత్ క్రోధం

ఉమా మహేష్ ఆచాళ్ల
98493 03247



ఇక్కడ చీకటైతేనే గానీ అక్కడ వెలుగురానంత దూరంలో ఉన్న కొడుక్కి ఫోన్ చేశాడు అనంతం.

''హా.. చెప్పు నాన్నా!'' అన్నాడు రాజేంద్ర ఆవులిస్తూ.

''అదేరా.. మీరు ఎప్పుడొచ్చేదీ చెబితే ఏర్పాట్లు చేద్దామని. డాక్టర్ గారికి కూడా చెప్పాలి కదా!?'' అన్నాడు అనంతం ఆదుర్దాగా.

''నాన్నా! అదీ.. ముందు వాళ్ల పేరెంట్స్ ఇంటికి వెళ్దాం అంటున్నది కౌసల్య. 'సర్జరీ కూడా అక్కడే చేయిద్దాం. మంచి హాస్పిటల్స్ ఉన్నాయి. తిరిగి యూఎస్ వెళ్లే ముందు మీ ఇంటికి వెళ్దాం' అంటున్నది'' అంటూ నసిగాడు రాజేంద్ర.

''అవునా!? ఏదీ ఫోన్ ఒకసారి అమ్మాయికి ఇవ్వు, నేను మాట్లాడతాను'' అన్నాడు అనంతం.

''హలో.. మావయ్యా చెప్పండి'' అంది కౌసల్య అవతల్నించి పొడిగా.

''ఆ అమ్మా.. బావున్నావా!? చంటాడు బావున్నాడా!? మీ అమ్మగారు నాన్నగారు కులాసానా!?'' అన్నాడు అనంతం అభిమానంగా.

''ఆ.. అంతా బావున్నాం మావయ్యా! మీ ఆరోగ్యం ఎలా ఉంది!?'' అడిగింది న్యూస్ పేపర్ తిరగేస్తూ.

''నాకేం.. చొక్కా వేసుకునేటప్పుడు కనబడే 'జెర్రి' లాంటి మచ్చ తప్ప, బైపాస్ చేయించుకున్నానన్న విషయమే గుర్తురానంత ఆరోగ్యంగా ఉన్నాను. అదేనమ్మా.. చంటాడి ఆపరేషన్ విషయం మా ఫ్రెండ్ సూర్రావుతో మాట్లాడాను. అతను నాతోబాటు ఆర్మీలో డాక్టర్‌గా చేసి రిటైర్ అయ్యాక మన ఊళ్లోనే హాస్పిటల్ పెట్టాడు. చాలా మంచివాడు, హస్తవాసి ఉన్నవాడు. టాన్సిల్స్ చాలా చిన్న ఆపరేషనట. 'ఒక్క పూటలో చేసి పంపించేస్తాను' అన్నాడు. మీరు నేరుగా ఇక్కడకి వస్తే బావుంటుంది'' అన్నాడు ప్రాధేయ పడుతూ.

''అదీ మావయ్యా.. మీకెందుకు ఇబ్బందని..'' అంటూ ఉండగా, అతను మధ్యలోనే..

''ఇబ్బందా!? మీ అత్తయ్య పోయాక ఒక్కణ్నీ ఉండలేక మీరు ఎప్పుడొస్తారా అని ఎదురు చూస్తున్నా. నాకూ చంటాడితో కొన్నిరోజులు గడిపినట్టు ఉంటుంది కదా'' అని, మళ్లీ చెప్పడం మొదలుపెట్టాడు.

''నీకు తెలుసుకదమ్మా.. నేను పెద్దగా చదువుకోలేదు. ఇక్కడ ఉంటేనే దేశంమీద ప్రేమ ఉన్నట్టు అనుకుని, మీరు అమెరికా వెళ్తామంటే అభ్యంతరం పెట్టాను. తర్వాత అర్థమైంది. మీలాంటి వాళ్లు కష్టపడి అక్కడినించి పంపే డాలర్ల వల్ల మన రూపాయి బలపడుతుందని, ఇదీ ఒకరకమైన దేశభక్తే అని. అందుకే నీకు మళ్లీ మళ్లీ సారీ చెబుతున్నా. అవేమీ మనసులో పెట్టుకోకుండా మీరు రండి. ఓ నాలుగు రోజులు గడిపి అప్పుడు మీ పుట్టింటికి వెళుదురు'' అన్నాడు ప్రాధేయ పడుతూ.

కాసేపు తటపటాయించి..

''సరే మావయ్యగారు!'' అనగానే..

అనంతం సంతోషంగా..

''థాంక్స్ అమ్మా! మరొక్క విషయం. నన్ను 'మీరు' అనకమ్మా, మీ నాన్నగారి లాగానే నేనూ..'' అన్నాడు.

ఫోన్ పెట్టేసింది కౌసల్య.

నిజానికి ఆమె పుట్టింటికి వెళ్లాలనే నిర్ణయించుకుంది. కానీ తన తల్లికి ఫోన్ చేస్తే..

''మీ వదిన చంటిపిల్లతో ఉంది. పిల్లాడి ఆపరేషన్ అంటున్నావు, హాస్పిటల్ ఇన్‌ఫెక్షన్స్ అవీ తగిలితే ఇబ్బంది. మీ మావగారు చేయిస్తానంటూ రమ్మన్నారుగా.. అక్కడే చేయించి, తిరిగి యూఎస్ వెళ్లేముందు మనింటికి రండి'' అని నిర్మొహమాటంగా చెప్పేసింది.

ఆ విషయం భర్తకి కూడా చెప్పలేదు కౌసల్య. మావగారితో మరీమరీ చెప్పించుకుని అయిష్టంగానే ఓకే అంది.

* * *

కోడలు ఒప్పుకొన్న దరిమిలా అనంతం హడావుడి మొదలైంది. భార్య పోయిన తర్వాత ఒంటరిగా ఉండటం అతనికి కష్టంగా ఉంటున్నది. రైతు పోలయ్య అప్పుడప్పుడూ వస్తాడు. కావాల్సిన కిరాణా సామాను, కూరగాయలు తెప్పించి పెట్టాడు. ఆర్మీలో పనిచేయటం వల్ల ఇంట్లోని వస్తువులన్నీ ఎప్పుడూ పద్ధతిగా పెరేడ్ గ్రౌండ్‌లోని సైనికుల్లా ఉంటాయి.

వాళ్లు వచ్చేరోజు అద్దెకారు మాట్లాడుకుని ఎయిర్‌పోర్ట్‌కి వెళ్లి.. వాళ్లని ఇంటికి తీసుకొచ్చాడు. ఆరోజు రెస్ట్ తీసుకున్నారు. ముగ్గురికీ కావాల్సినవి అనంతమే స్వయంగా వండిపెట్టాడు. ఆ మర్నాడు మంగళవారం అవటం చేత డాక్టర్ దగ్గరికి బుధవారం వెళ్దామన్నది కౌసల్య. ఆ ఉదయం చంటాడు పొలం తీసుకెళ్లమని పేచీ పెట్టాడు. తెల్లవారితే ఆపరేషన్.. దాంతో వద్దన్నది కౌసల్య.

''పోనీలే అమ్మా! చంటాడు సరదా పడుతున్నాడు. ఓ గంట అలా తిప్పి తీసుకొస్తాను'' అని బుల్లెట్ మీద మనవడిని ఎక్కించుకుని, పొలం బయల్దేరాడు అనంతం.

* * *